### నకిలీ విత్తనాలు విక్రయిస్తే

## కఠిన చర్యలు

ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి

యాచారం, జూన్7: నకిలీ విత్తనాలు అమ్మితే విత్తన డీలర్లు, దుకాణదారులపై కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి రవినాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రం లోని మన గ్రోమోర్ సెంటర్, ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి పలు రకాల రికార్డులు, ఎరువులు, విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందించాలని సూచించారు. దుకాణాల్లో లావాదేవీలకు సంబంధించిన రిజిస్టర్‌ను కొనసాగించాలన్నారు. రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కేశంపేట, జూన్ 7 : మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన కప్పెరి యాదమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామ యువ నాయకుడు పాలాది శ్రీనివాస్ శనివారం బాధిత కుటుంబాన్ని ఓదార్చి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మహేశ్, రాఘవేందర్, బాలు, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

# రసాయన ఎరువులు.. మోతాదుకు మించొద్దు

- ఎరువులు, పురుగుల మందుల వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి
- అధికంగా వాడితే భూసారానికి ముప్పు అంటున్న వ్యవసాయ నిపుణులు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిపై దృష్టి సారించాలి



ఇబ్రహీంపట్నం, జూన్ 7 : వానకాలం పంటల సాగులో రైతులు తగిన మోతాదులో ఎరువులు వాడాలని వ్యవసాయ నిపుణులు, వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అవసరానికి మించి వినియోగించటం వలన పెట్టుబడులు పెరుగటంతో పాటు భూసార దెబ్బతింటుందని గ్రామగ్రామాన అవగాహన సదస్సుల్లో వివరిస్తున్నారు. ఈ మేరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న వ్యవసాయ సదస్సుల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెద్ద ఎత్తున సూచనలు, సలహాలు చేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా గత యాసంగి సీజన్‌లో సరైన దిగుబడులు లేక అన్నదాతలు ఇబ్బందుల్లో కూరుకుపోయారు. దీంతో రైతులు పెద్ద ఎత్తున నష్టాలు చవిచూశారు. ఈ క్రమంలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పెట్టుబడులు అదుపులో ఉంచుకోవాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని సూచిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే మార్గాలపై దృష్టి సారించాలని అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులపై మక్కువ పెంచుకోవాలని సూచిస్తున్నారు.

**రసాయన ఎరువులతో భూసారానికి నష్టం..**

రైతులు చీడపీడల నివారణ కోసం పెద్ద ఎత్తున రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడకం ద్వారా భూసారం అధికంగా దెబ్బతినే అవకాశముంది. భూసారం దెబ్బతినటంతో భవిష్యత్‌లో పంటల సాగుకు భూములు పనికిరాకుండా పోయే ప్రమాదమున్నందున రైతులు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రసాయన ఎరువులు, పురుగుల మందులు తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. సహజసిద్ధమైన ఎరువులు వాడటం ద్వారా పంటలు అధిక దిగుబడులు సాధించే అవకాశముంటుందని సూచిస్తున్నారు.

**వ్యవసాయాధికారుల సూచనల పాటించాలి**

రైతులు దిగుబడిపైనే కాకుండా పొలాల్లో భూసారాన్ని కూడా కాపాడుకోవటంపై దృష్టి సారించాలి. అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడటం ద్వారా భూసారం దెబ్బతింటున్నందున రైతులు రసాయన ఎరువులు పూర్తిగా మరిచి సేంద్రియ ఎరువులను వాడుకోవాలి. పంటల సాగు సమయంలో భూసార పరీక్షలు చేసుకుంటే ఎంతో మేలు.

- శ్రవణ్‌కుమార్, ఏఈవో ఇబ్రహీంపట్నం

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

చేవెళ్ల రూరల్, జూన్ 7 : శంకర్‌పల్లి మండలం కొండకల్, వెలిమెల తండా శివారులోని లంబాడ గిరిజన ప్రజలు తమ 80 ఎకరాల బిలాదాకాల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్ష 148వ రోజుకు చేరింది. శనివారం దీక్షలో పాల్గొన్న భూ బాధితులు మాట్లాడుతూ.. పలు రియల్ ఎస్టేట్ కంపెనీల వారు తమకు సంబంధించిన భూములను ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కాలె యాదయ్య, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాథోడ్‌శంకర్ నాయక్, లక్ష్మణ్, రవి, బాబు, లక్ష్మణ్, చందర్‌రెడ్డి, గోపి, సోనిబాయి, వసుంధర, తులసి, గోమా, మున్న, శంకరమ్మ, మాణెమ్మ, కవిత, వెంకటయ్య, శాంతయ్య, బీఆర్ఎస్ నాయకుడు రాజు, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రీకొడుకులపై దాడి..

### మద్యం మత్తులో రాళ్లతో కొట్టి.. కారు అద్దాలు ధ్వంసం

ధ్వంసమైన కారు అద్దాలు

చేవెళ్ల రూరల్, జూన్ 7: మద్యం మత్తులో తండ్రీకొడుకులపై దాడి చేయడంతో పాటు కారు అద్దాలు ధ్వంసం చేసిన ఘటన చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఊరెళ్లలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రానికి చెందిన మహమ్మద్ షఫీయుద్దీన్ బక్రీద్ కోసమని శుక్రవారం రాత్రి తన పెద్ద కొడుకు తాఖీయుద్దీన్, మిత్రుడు మహమ్మద్ హుస్సేన్, మనవడితో కలిసి గొర్రెలు కొనుగోలు కోసం కారులో ఎన్కెపల్లి గ్రామానికి వెళ్తుండగా, ఊరెళ్ల గ్రామంలోని అంబేద్కర్ రాస్తా వద్దకు చేరుకోగానే గ్రామానికి చెందిన శ్రీను, కిరణ్, మరో ఐదుగురు వ్యక్తులు మద్యం సేవించి రోడ్డుపై బైక్‌ను అడ్డుపెట్టారు. పక్కకు తీయమని కోరగా.. మీరే పక్క నుంచి పోవాలని దురుసుగా సమాధానం ఇచ్చారు. దీంతో వారు ముందుకు వెళ్తుండడంతో మళ్లీ బైక్ అడ్డు పెట్టారు. షఫీయుద్దీన్, తాఖీయుద్దీన్ రోడ్డు ఖాళీ చేయమని కోరారు. అయినప్పటికీ వినకుండా అసభ్యకరమైన పదాలతో దూషిస్తూ వాగ్వాదానికి దిగారు. మరి కొందరిని అక్కడికి పిలిపించి తండ్రీకొడుకులపై దాడి చేశారు. అంతటితో ఆగకుండా రాళ్లతో కారు అద్దాలు ధ్వంసం చేశారు. ఈ గొడవలో తాఖీయుద్దీన్‌కు కుడి చేతికి తీవ్ర గాయమైంది. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఘటనా స్థలానికి చేరుకునేలోపు నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. షఫీయుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శిరీష తెలిపారు.

# బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ఆదిబట్ల, జూన్ 7: బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేశ్ అన్నారు. శనివారం ఆదిబట్లలో ఉపాధ్యాయులు డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేసి ప్రతి ఇంటిని సందర్శించి బడీడు పిల్లలను గుర్తించి శనివారం ఆరుగురు విద్యార్థులకు అడ్మిషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, భాషయ్య పాల్గొన్నారు.

**2025 బడిబాట షెడ్యూల్..**

- జూన్ 8, 9, 10 తేదీల్లో కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేయనున్నారు. అలాగే గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల సందర్శించడం. గ్రామాల్లోని డ్రాపౌట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేలా ఏర్పాట్లు చేయడం, ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించడం.
- జూన్ 11వ తేదీన జూన్ 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారు.
- జూన్ 12న అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభిస్తారు. అదేరోజు బడిలో చేరిన విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫాం అందజేయడం.
- జూన్ 13న ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్థులతో మీటింగ్ ఏర్పాటు చేసి సామూహిక అక్షరాభ్యాసం, బాలసభ నిర్వహిస్తారు.
- జూన్ 16న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (లిప్) దినోత్సవం నిర్వహించడం.
- జూన్ 17న అన్ని పాఠశాలల్లో సమీకృత విద్య, బాలిక విద్యా దినోత్సవం నిర్వహించడం, బాలిక వివాహాలు, చిన్నారులపై వేధింపులకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించడం.
- జూన్ 18న తల్లిదండ్రులు, గ్రామస్థులను పాఠశాలలకు ఆహ్వానించి తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన డిజిటలీకరణ, ఇతర ఆధునిక సౌకర్యాలను చూపించి, వాటి గురించి వివరించడం.
- జూన్ 19న బడిబాట ముగింపు రోజున విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తారు.

పెద్దఅంబర్‌పేట : కుత్బుల్లాపూర్ గ్రామంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఆదిబట్ల: ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించాలని ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయుడు, విద్యార్థులు

**కుత్బుల్లాపూర్‌లో..**

పెద్దఅంబర్‌పేట, జూన్ 7: మున్సిపాలిటీ పరిధి కుత్బుల్లాపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాల కమిటీని ఏర్పాటు చేశారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేరాలని ప్రచారం చేశారు. ప్రచారానికి మంచి స్పందన వచ్చిందని ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్ తెలిపారు. 100 మంది విద్యార్థులను బడిలో చేర్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

**కొహెడలో..**

తుర్కయాంజాల్ : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కొహెడలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తుర్కయాంజాల్ : కొహెడలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

### ప్రభుత్వ కళాశాలల్లోనే

## నాణ్యమైన విద్య

విద్యార్థులకు కరపత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

ఆమనగల్లు, జూన్ 7: ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు కోరారు. ఈ మేరకు అధ్యాపకులు శనివారం ఆమనగల్లు పట్టణంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్పొరేట్, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో మంచి ఉత్తీర్ణత శాతం వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులకు అధ్యాపకులు వివరిస్తున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణయ్య, జైపాల్, నాగమణి, లక్ష్మణ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కేశంపేట, జూన్ 7 : ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన కుమార్(38) గతకొంతకాలంగా చెవిపోటుతోపాటు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడన్నారు. ఈ నేపథ్యంలోనే ఉదయం వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని సమీప పొలాల రైతులకు కనిపించాడని పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానికులు కుమార్ కుటుంబ సభ్యులకు తెలపగా ఘటన స్థలానికి వచ్చి పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారన్నారు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

## తాటి, ఈత చెట్లు నరికితే చర్యలు

ఆమనగల్లు, జూన్ 7: తాటి, ఈత చెట్లు నరికితే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ బద్యానాథ్ చౌహాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఎక్సైజ్ శాఖ చట్టం-1968 ప్రకారం ఎక్సైజ్ అధికారుల అనుమతి లేకుండా తాటి, ఈత చెట్లను నరకడం నేరమని పేర్కొన్నారు. రైతులు తమ సొంత పొలాల్లో ఉన్న చెట్లను తొలగించడానికి అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. చెట్లను తొలగించేందుకు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం కలెక్టర్ పర్యవేక్షణలోని త్రిసభ్య కమిటీ సభ్యులు పొలంలోని చెట్లను పరిశీలిస్తారన్నారు. తొలిగించే ఒక్కో చెట్టుకు రూ.1,968 రుసుం చెల్లించడంతోపాటు ఎక్సైజ్ అధికారులు సూచించిన మేరకు ప్రాంతాల్లో కొత్త రకం చెట్లను నాటాలన్నారు. అనుమతి లేకుండా చెట్లను తొలగిస్తే మొదటి తప్పుగా మూడు నెలల శిక్ష, రెండపసారి తొలగిస్తే ఆరు నెలల జైలుతో పాటు, జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. ఎవరైన తొలగిస్తే 87126 58742, 90005 71671 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతి

పెద్దఅంబర్‌పేట, జూన్ 7: అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధి బాటసింగారం గ్రామ పరిధిలోని ఫ్లైఓవర్‌పై శనివారం ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఆమె కాళ్లకు గాయాలు ఉన్నాయని, యాచకురాలు అయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## వృద్ధురాలికి అంతిమ సంస్కారాలు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 7 : పొట్ట కూటికోసం బీహార్ నుంచి నగరానికి వలస వచ్చి అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ం కాలనీలో నివాస ముంటున్న సుశీలదేవి (75) తన కుమారులతో ఉండేది. ఇటీవల పిల్లలు కూడా దూరం కావడంతో ఒంటరిగా జీవనం సాగిస్తుంది. ఈ మధ్య ఆమె అస్వస్థతకు గురై శనివారం ఉదయం మరణించింది. విషయం తెలుసుకున్న సురక్ష గ్రూపు సభ్యులు విరాళాలు సేకరించి ఆ వృద్ధురాలి అంత్యక్రియలకు రూ. 12వేలను మృతురాలి బంధువులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కాకునూరులో గుడిసె దగ్ధం

దగ్ధమైన గుడిసె

కేశంపేట, జూన్ 7 : మండల పరిధిలోని కాకునూరు గ్రామానికి చెందిన రమేశ్ పూరిగుడిసెలో శుక్రవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు మంటలను అదుపుచేసినట్లు వివరించారు. విషయం తెలుసుకున్న బాధితుడు శనివారం ఉదయం వచ్చి చూడగా తాను దాచి పెట్టిన డబ్బులు రూ.60వేలు అగ్నికి ఆహుతైనట్లు బాధితుడు బోరున విలపించాడు. ప్రభుత్వం, దాతలు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదానికి షాట్ సర్క్యూట్ కారణమై ఉంటుందని పలువురు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

## వర్షానికి విరిగిపడిన చెట్లు

### రాకపోకలకు ఏర్పడిన అంతరాయం

కేశంపేట, జూన్ 7 : మండలంలో శనివారం కురిసిన వర్షానికి రహదారికి ఇరువైపులా చెట్లు విరిగిపడ్డాయి. ఈ సందర్భంగా మండలంలోని కోనాయపల్లి, కొత్తపేట, సంతాపూర్ గ్రామాల్లో కురిసిన వర్షానికి 10కిపైగా చెట్లు విరిగిపడ్డాయని, తద్వారా కొత్తపేట - కోనాయపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. కొత్తపేట నుంచి హైదరాబాద్ వెళుతున్న వాహనదారులు, ప్రయాణికులు దారి మళ్లించి సంతాపూర్ మీదుగా వెళుతునట్లు వివరించారు. కేశంపేట మండలంలో 3.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై విరిగిపడిన చెట్లను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆకట్టుకున్న కూచిపూడి..భరతనాట్యం

కొండాపూర్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు అలరించాయి. చెన్నై నుంచి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి రాజేశ్వరి , శ్రీముఖి నృత్యాలయ నాట్యగురువు మనస్విని కోసూరు శిష్యబృందం కూచిపూడి అంశాలను మనస్విని, అంజనా, రుక్మిణి, హిమశ్రీ, శ్రీలేఖ, భువన, సహస్ర, హరిణి, దివ్య శ్రీ, ఆరాధ్య, శ్రీనిక, రుత్విక, అన్విక, విజయ శ్రీ, పూర్వీక, మాన్విత, హరి హర ప్రదర్శించారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

ఆమనగల్లు : త్యాగానికి ప్రతీక బక్రీద్ అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆమనగల్లు పట్టణంలో జరిగిన బక్రీద్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో బక్రీద్ జరుపుకొంటారని పేర్కొన్నారు. త్యాగం, సహనం, బక్రీద్ పండుగ ఇచ్చే సందేశమన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు మసీదులు, ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మెకానిక్ బాబా, మహ్మద్ మాసూం, సయ్యద్ ఖలీల్, ఖాధర్ ఖాద్రీ, ఖాధర్, కరీం, రహీం, అలీం, ఫరీద్, కలీం, హఫీజ్, వివిధ పార్టీ నాయకులు పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షుడు నర్సింహ, జగన్, మానయ్య, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, మాజీ మండల అధ్యక్షుడు రాములు, ఏఎంసీ డైరెక్టర్ శ్రీశైలం, నాయకులు విజయ్‌నాయక్, కృష్ణానాయక్, శివలింగం, అప్పం శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, విజయ్‌రాథోడ్, శ్రీనునాయక్, వెంకటేశ్, నర్సింహ ఉన్నారు.

**షాద్‌నగర్‌టౌన్ :** మున్సిపాలిటీలోని ఫరూఖ్‌నగర్ ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈద్గా వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు ముస్లింలకు పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ సర్వర్‌పాషా, నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజు, బస్వం, కృష్ణ, రఘు, జమృత్‌ఖాన్, ఇబ్రహీం, ముబారక్, అర్జున్‌లక్ష్మణ్, ప్రవీణ్, దిలీప్, శేఖర్, అశోక్, ఖదీర్ పాల్గొన్నారు.

**యాచారం :** మండల కేంద్రంలోని మేడిపల్లి, నల్లవెల్లి, నందివనపర్తి, గున్గల్, మాల్, కొత్తపల్లి, తాటిపర్తి, చౌదర్పల్లి గ్రామాల్లో దర్గాలు, మసీదుల్లో ప్రార్థనలు చేశారు.

**చేవెళ్లటౌన్ :** పట్టణ, మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. సీఐ భూపాల్ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**చేవెళ్ల రూరల్ :** చేవెళ్ల మండల పరిధి గ్రామాలు, శంకర్‌పల్లిలో మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు.

కడ్తాల్, జూన్ 7: మండల కేంద్రంతోపాటు పరిధిలోని రావిచేడ్, న్యామతాపూర్, మక్తమాదారం, సాలార్‌పూర్, ముద్విన్, చరికొండ గ్రామాల్లో, శనివారం బక్రీద్ జరుపుకున్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద మజీద్ ఇమామ్ జహీరుద్దీన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, మహ్మద్ జావిద్, సీఐ గంగాధర్, ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు భీక్యానాయక్, రాఘవేందర్, జహంగీర్‌అలీ, రామచందర్‌నాయక్, వాహబ్, అసిఫ్ అలీ, ఇర్షాద్, అహ్మద్, గౌస్, బాబా, లతీఫ్, షఫీ, ఇమ్రాన్, అమేర్, సల్మాన్, సలీం, సాధిక్, రజాక్, రవి, భానుకిరణ్ పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతో పాటు ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్, ఆదిబట్ల, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీల్లో ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలు చేశారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఆధ్వర్యంలో పోలీసు నిఘా ఏర్పాటు చేశారు.

**షాద్‌నగర్‌రూరల్ :** ఫరూఖ్‌నగర్ మండలంలోని గ్రామాల్లో ముస్లింలు కొండన్నగూడ, చించోడ్, పీర్లగూడెం, చౌలపల్లి, కమ్మదనం, రాయికల్, విత్యాల, ఎలికట్ట, మొగిలిగిద్ద, బుచ్చిగూడ, బూర్గుల, గంట్లవెల్లి, వెలిజర్ల, కంసాన్‌పల్లి, మదులాపూర్ తదితర గ్రామాల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు.

**షాబాద్ :** మండలంలోని షాబాద్- సంకెపల్లిగూడ ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షాబాద్, పోతుగల్, బోడంపహాడ్, హైతాబాద్, సోలీపేట్, మన్మర్రి, తిర్మలాపూర్, సర్దార్ నగర్, నాగరగూడ, తాళ్లపల్లి, మీరాపూర్, బొబ్బిలిగామ, తదితర గ్రామాల్లో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలకు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు మతీన్, ఇమ్రాన్. ఆరీఫ్, జాకీర్ షరీఫ్, అల్తాఫ్ పాల్గొన్నారు.

**కేశంపేట :** మండలంలోని లేమామిడి - నిర్దవెల్లి శివారులోగల ఈద్గా వద్ద మైనార్టీలు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మక్బూల్, జబ్బార్‌ఖాన్, హఫీజ్‌ఖాన్, నసీరుద్దీన్, అర్మాన్, జాహేద్, ఇస్మాయిల్, జబ్బార్, అజీస్‌ఖాన్, ఆమేర్, ఖాజా, ఫైజన్, పాషా, సిరాజ్, వాజిద్, బద్రుద్దీన్, అజహర్, జాకీర్, శాబోద్దీన్, మజహర్, పల్లాటి కృష్ణ, జయసింగ్, సుధాకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

**కొందుర్గు :** కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో బక్రీద్ వేడుకలను మైనార్టీలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, మాజీ ఎంపీటీసీ ఇస్తారమ్మ మాణయ్య, ప్రభాకర్, రాములు, వెంకటేశ్ పాల్గొన్నారు.

**మంచాల :** మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం బక్రీద్ ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు**
**పండుగ శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, అధికారులు**
**పటిష్ట బందోబస్తు నిర్వహించిన పోలీసులు**



షాబాద్: ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

చేవెళ్లలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## వ్యక్తి ఆచూకీ లభ్యం

### కుటుంబ సభ్యులకు అప్పగింత

నరసింహను కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

యాచారం, జూన్7: అదృశ్యమైన వ్యక్తిని నెల రోజుల తర్వాత ఆచూకీ లభ్యం కావడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజు తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని